నిజాంసాగర్‌లో ప్రస్తుత నీటిమట్టం

# కాంగ్రెస్‌కు కాళేశ్వరమే దిక్కు

- నిజామాబాద్‌లో లోటు వర్షపాతం
- నిజాంసాగర్‌కు చేరని వరదనీరు
- ఆయకట్టు రైతుల్లో ఆందోళన
- కొండపోచమ్మ నుంచి నిజాంసాగర్‌కు నీటి విడుదలకు నిర్ణయం

నిజామాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కాళేశ్వరం ప్రాజెక్టుపై బురద జల్లేందుకు యత్నిస్తున్న కాంగ్రెస్ సర్కారు తప్పని పరిస్థితిలో తిరిగి అదే ప్రాజెక్టుపైనే ఆధారపడాల్సి వస్తున్నది. వర్షాభావ పరిస్థితులకు తోడు ఉన్న నీటి నిల్వలను ఇష్టానుసారంగా వాడటంతో నిజాంసాగర్‌లో నీటి వనరులు తగ్గిపోయాయి. ఆయకట్టు కింద నార్లు పోసుకునేందుకు అదును దాటుతుండడంతో నీటి విడుదల అనివార్యమైంది. దీంతో కేసీఆర్ రూపొందించిన కాళేశ్వరం పథకంలో భాగంగానే కొండపోచమ్మ సాగర్ నుంచి కాళేశ్వరం జలాలను నిజాంసాగర్‌కు తరలించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది.

### లోటు వర్షపాతంతో ఆందోళన

వానకాలం మొదలై నెల రోజులు కావొస్తున్నా లోటు వర్షపాతంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కొట్టుమిట్టాడుతున్నది. నిజాంసాగర్ ఆయకట్టు రైతులకు ఈ ముప్పు తీవ్రంగా ప్రభావం చూపుతున్నది. ఎందుకంటే ఏటా జూన్ మొదటి వారానికే నాట్లు వేశారు. లక్షల ఎకరాలకు సాగు నీటి అవసరం ఏర్పడగా, నిజాంసాగర్‌లో నీటి నిల్వ ప్రమాదకరంగా మారింది. సాగుకు ఎలాగైనా నిజాంసాగర్ నీళ్లు ఇవ్వాలని రైతులు కోరుతుండటంతో చేసేది లేక పార్టీ మారిన ఓ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నుంచి గెలిచిన మరో ఎమ్మెల్యే కలిసి కొండపోచమ్మ నీటిని విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ సృష్టించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కొండపోచమ్మ సాగర్ నుంచి నిజాంసాగర్‌కు రెండు టీఎంసీలు నీళ్లను తరలించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

### రెండు టీఎంసీలకు అనుమతి వచ్చింది..

కొండపోచమ్మ సాగర్ నుంచి రెండు టీఎంసీల నీళ్లను నిజాంసాగర్‌కు తరలించేందుకు ఈఎన్‌సీ నుంచి అనుమతి వచ్చింది. ప్రస్తుతం నిజాంసాగర్‌లో మూడు టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఆయకట్టు రైతుల అవసరాల రీత్యా కొండపోచమ్మ సాగర్ నుంచి నిజాంసాగర్‌కు నీటిని తరలిస్తాం. నిజాంసాగర్‌కు వరద నీటి రాక మొదలైతే కొండపోచమ్మ సాగర్ నుంచి నీటి తరలింపు ఉండదు. పరిస్థితుల ఆధారంగా దీనిపై నిర్ణయం ఉంటుంది.

– శ్రీనివాస్, కామారెడ్డి నీటి, ఇరిగేషన్ శాఖ

# పీసీసీ అధ్యక్ష పదవి బీసీలకే ఇవ్వాలి

- రాహుల్ గాంధీకి బీసీ రాజ్యాధికార సమితి లేఖ

హైదరాబాద్, జూన్28 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో సామాజిక న్యాయం సాక్షాత్కారం కావాలంటే పీసీసీ అధ్యక్షుడిగా బీసీలకే అవకాశం ఇవ్వాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్‌గాంధీకి శుక్రవారం లేఖ రాశారు. తెలంగాణలో, దేశంలో భవిష్యత్తు రాజకీయాలు బీసీల చుట్టే తిరగనున్నాయని, బీసీల ఎదుగుదలను విస్మరిస్తే జాతీయ పార్టీలకు మనుగడ కష్టమేనని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికలలో బీసీలకు సీట్లు కేటాయించలేదని, ప్రస్తుతం పీసీసీ అధ్యక్ష పదవినైనా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# పాలన గాలికి.. ప్రభుత్వం ఢిల్లీకి!

- ఆరు రోజులుగా ఢిల్లీలోనే సీఎం రేవంత్ మకాం
- డిప్యూటీ సీఎం, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలూ
- రాష్ట్రంలో అధికారిక కార్యక్రమాలు సైతం వాయిదా
- విస్మయం వ్యక్తం చేస్తున్న రాజకీయ వర్గాలు

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో మకాం వేసి ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఐదు రోజులు దాటింది. రోజూ పార్టీ అంతర్గత చర్చల్లో మునిగి తేలుతున్నారు. చెప్పుకోవడానికి మొదటి మూడు రోజులు నలుగురు కేంద్రమంత్రులతో భేటీ అయినా, తర్వాత రెండు రోజులు మాత్రం పూర్తి సమయం 'పెద్దల' వద్దే గడిపారని విమర్శలు వినిపిస్తున్నాయి. సీఎం ఒక్కరే కాదు.. డిప్యూటీ సీఎం, ఏడుగురు మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు కూడా ఢిల్లీకి వెళ్లినవారిలో ఉన్నారు. కొందరు కొన్ని రోజులుగా అక్కడే మకాం వేయగా.. మరికొందరు అటెండెన్స్ వేసుకొని తిరిగి వచ్చేశారు. గత ఐదు రోజుల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్ కూడా ఢిల్లీకి వెళ్లి వచ్చారు. ముగ్గురు మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర్ రావు, దామోదర రాజనర్సింహ తప్ప మిగతా మంత్రులంతా హైదరాబాద్–ఢిల్లీ మధ్య చక్కర్లు కొట్టారు. ఈ తతంగం మొత్తాన్ని ఒక్క ముక్కలో చెప్పాలంటే 'పాలనను గాలికి వదిలేసి ప్రభుత్వం ఢిల్లీకి వెళ్లినట్టుంది' అని రాజకీయ వర్గాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ పెద్దలంతా ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతుండటంతో రాష్ట్రంలో పాలన గాడి తప్పుతున్నదని చెప్పున్నారు. ప్రతిరోజు పర్యవేక్షించాల్సిన, అత్యంత కీలకమైన శాఖలన్నీ సీఎం రేవంత్‌రెడ్డి దగ్గరే ఉన్నాయి. హోం, విద్య, మున్సిపల్ వంటి కీలక శాఖలన్నీ సీఎం వద్దే ఉన్నాయి. వరుస నేరాలతో రాష్ట్రంలో కొన్ని రోజులుగా పోలీసింగ్ గాడి తప్పిందనే విమర్శలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. మరోవైపు స్కూళ్లు, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ ఇతర ఉన్నత విద్యాసంస్థల్లో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. టీచర్ల బదిలీలు, ప్రమోషన్లతో హడావుడిగా ఉన్నది. ఇలాంటి కీలక సమయంలో ఆయా శాఖలను పర్యవేక్షించాల్సిన సీఎం.. ఢిల్లీలో మకాం వేయటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అంటున్నారు.

### పార్టీ చర్చలపైనే శ్రద్ధ

ఐదు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాలన కన్నా పార్టీ చర్చలపైనే శ్రద్ధ పెట్టినట్టు విమర్శలు వస్తున్నాయి. ఎంపీల ప్రమాణస్వీకారం కోసం అంటూ ఆయన సోమవారం ఢిల్లీకి వెళ్లారు. అక్కడ సోమవారం రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ కట్టర్, మంగళవారం కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా, బుధవారం కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. గురు, శుక్రవారాల్లో పూర్తిగా పార్టీ చర్చలకే పరిమితం అయ్యారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అలక, క్యాబినెట్ విస్తరణ, నామినేటెడ్ పోస్టులు, పీసీసీ అధ్యక్షుడి నియామకం వంటివి చర్చిస్తున్నారు. వాస్తవానికి ఆయన గురువారం రాత్రి తెలంగాణకు వచ్చి.. శుక్రవారం వరంగల్‌లో పర్యటించాల్సి ఉన్నది. కానీ ఆ కార్యక్రమాన్ని శనివారానికి వాయిదా వేశారు. ఇక.. జీవన్ రెడ్డి అంశం మినహా మిగతా అన్ని అంశాలపై కొన్ని వారాలుగా చర్చోప చర్చలు జరుగుతున్నవేనని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. దాదాపుగా తుది నిర్ణయానికి వచ్చేసినట్టేనని అంటున్నాయి. వెంటనే నిర్ణయం ప్రకటించకుండా ఐదు రోజులుగా నాన్చుతున్నారంటూ అసహనం వ్యక్తం చేస్తున్నాయి. ఢిల్లీలో ఐదు రోజులుగా జరుగుతున్న పరిణామాలపై ప్రజలు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ గోడు చెప్పుకునేందుకు సచివాలయానికి వస్తే ఎవరూ అందుబాటులో ఉండటం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం, మంత్రులతోపాటు పలువురు ఉన్నతాధికారులు సైతం ఢిల్లీకి వెళ్లాల్సి వస్తున్నది. ఇదే అదనుగా ఆయా శాఖల్లో అధికారులు ఆఫీస్ పనులపై పెద్దగా దృష్టిపెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటివి కాంగ్రెస్‌లో సహజమే.. ప్రజలే మళ్లీ అలవాటుపడాలి అంటూ ఆ పార్టీ నేత ఒకరు చెప్పడం కొసమెరుపు.

# ఆయారాంలకు పదవుల్లేవ్

మొదటిపేజీ తరువాయి...

ఆదాయం పెరిగిందని సీఎం రేవంత్ చెప్పారు. ప్రభుత్వం ప్రతినెల రూ.350 కోట్లు చెల్లిస్తున్నదని వివరించారు. దీంతో నిర్వహణ నష్టాలు తగ్గాయని, ఆక్యుపెన్సీ 30 శాతం నుంచి 80 శాతానికి పెరిగిందని వెల్లడించారు. గత అప్పులతో సంబంధం లేకుండా చుస్తే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆర్టీసీ లాభాలతో నడుస్తున్నదని చెప్పారు. ధరణిలో ఉన్న లోపాలు సరిచేసే పనిలో ఉన్నామని, పేరు మార్పుపై తర్వాత ఆలోచిస్తామని అన్నారు. భూముల రికార్డులను కంప్యూటరైజ్డ్ చేయాలా? గతంలో మాదిరిగా మాన్యువల్ పద్ధతి పాటించాలా? అనేది అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బడ్జెట్ సమావేశాల తర్వాత మండలాలు, రెవెన్యూ డివిజన్ల మార్పుపై కమిషన్ నియమిస్తామని వెల్లడించారు. రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్నదని, రూ.లక్ష కోట్ల వరకు పెండింగ్ బిల్స్ ఉన్నాయని వివరించారు. రాష్ట్రం విడిపోయినప్పుడు నెలకు రూ.6,500 కోట్లు కట్టేవారని, ఇప్పుడు నెలకు రూ.7వేల కోట్లు అప్పులు కడుతున్నామని చెప్పారు.

### అదానీకి ఇస్తే తప్పేముంది

పాత బస్తీలో విద్యుత్ బిల్లుల వసూళ్ల బాధ్యతను అదానీ కంపెనీకి అప్పగించామని, అందులో తప్పేముందని సీఎం ప్రశ్నించారు. అక్కడ అండర్ గ్రౌండ్ విద్యుత్తు లైన్లు వేసి మొత్తం వ్యవస్థను మార్చాలని కోరామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆస్తులను అదానీకి అప్పగించడాన్ని రాహుల్ గాంధీ తప్పు పడుతున్నారని, అంతేతప్ప అదానీతో వ్యాపారం చేయొద్దని ఎప్పుడూ అనలేదన్నారు.

### 4 రోజుల్లో రుణమాఫీ మార్గదర్శకాలు

రూ.2 లక్షల వరకు మాత్రమే రుణమాఫీ ఉంటుందని సీఎం వెల్లడించారు. రైతు రుణమాఫీ తర్వాత రైతుబంధు, ఇతర పథకాలపై దృష్టి పెడతామని వివరించారు. పంట రుణాలు మాత్రమే మాఫీ అవుతాయని, బంగారంపై తీసుకున్న రుణాలకు వర్తించదని స్పష్టంచేశారు. పాస్‌బుక్ ఆధారంగానే రుణమాఫీ ఉంటుందని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో కరెంటు కోతలు లేవని, అంతరాయాలు మాత్రమే ఉన్నాయని చెప్పారు. కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండు రోజుల్లో తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అవుతాయని తెలిపారు.

### దుబాయ్‌లో తప్పిపోయిన జగిత్యాలవాసి

- విదేశాంగ శాఖ మంత్రికి ట్వీట్ చేసిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, జూన్ 28 : జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్‌కు చెందిన వడ్లకొండ మల్లేశ్ వారం క్రితం ఓమన్–యూఏఈ సరిహద్దులో తప్పిపోయాడని, అతను క్షేమంగా వచ్చేలా చూడాలని కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీ టీ జీవన్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. మల్లేశ్ 15 రోజుల క్రితం దుబాయ్ వెళ్లగా ఓమన్–యుఏఈ సరిహద్దులో అక్రమంగా దాటుతుండగా పుజీరా, యూఏఈ జైల్లో వేసినట్టు తమకు తెలిసిందని అన్నారు. మల్లేశ్ కుటుంబ సభ్యుల విజ్ఞప్తితో స్పందించిన జీవన్‌రెడ్డి.. అతని ఆచూకీ తెలుసుకొని, క్షేమంగా రప్పించేలా చూడాలని కోరుతూ మస్కట్, దుబాయ్‌లోని భారత రాయబారులకు, కేంద్ర విదేశాంగ మంత్రికి, ముఖ్యమంత్రి కార్యాలయంతోపాటు కలెక్టర్, ఎస్పీకి ఎక్స్ ద్వారా ట్వీట్ చేశారు.

# రెండ్రోజుల్లో పీసీసీ అధ్యక్షుడి ప్రకటన!

- రాష్ట్ర నేతలతో సంప్రదింపులు పూర్తి
- ఇద్దరి పేర్లను ప్రతిపాదించిన సీఎం
- తుది నిర్ణయం అధిష్ఠానం కోర్టులో...
- కాంగ్రెస్‌లోకి ఎమ్మెల్యే కాలె యాదయ్య

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడి ఎంపికపై రెండు రోజులుగా ఢిల్లీలో కొనసాగుతున్న కసరత్తు కొలిక్కి వచ్చినట్టు తెలిసింది. ఒకటి రెండు రోజులలో కొత్త పీసీసీ అధ్యక్షుడిని ప్రకటించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాల సమాచారం. పీసీసీ అధ్యక్షుడి ఎంపికలో ప్రస్తుత పీసీసీ అధినేత, సీఎం రేవంత్‌రెడ్డి మాట నెగ్గుతుందా? లేక ఇతరుల మాట నెగ్గుతుందా? అనేది కాంగ్రెస్ వర్గాలలో ఆసక్తికరంగా మారింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ లేక మహబూబాబాద్ ఎంపీ బల్‌రాం నాయక్ పేర్లను రేవంత్‌రెడ్డి ప్రతిపాదించినట్టు సమాచారం. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో మొదట చర్చించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నుంచి అభిప్రాయాన్ని సేకరించింది. ఆ తర్వాత మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితర ముఖ్య నాయకుల అభిప్రాయాలను కూడా తీసుకున్న ఆమె పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ సంస్థాగత జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు నివేదించినట్టు తెలిసింది. పీసీసీ అధ్యక్షుడి ఎంపికలో అనుసరించాల్సిన సామాజిక సమీకరణలపై సీఎం తన వాదనను అధిష్ఠానానికి వినిపించగా, అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీతో చర్చించిన అనంతరం రెండు, మూడు రోజుల్లో కొత్త అధ్యక్షుడిని ప్రకటించనున్నట్టు కేసీ తెలిపినట్టు సమాచారం.

ఎమ్మెల్యే కాలె యాదయ్యకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

### కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే

చేవెళ్లకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్య ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీతో కలిసి ఎమ్మెల్యే కాలె యాదయ్యను సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ వద్దకు తీసుకెళ్లి పార్టీ కండువా కప్పించారు.

- వావ్.. పెద్ద చేపలు

మంచిర్యాల జిల్లా ఎల్లంపల్లిలో నీటిమట్టం డెడ్‌స్టోరేజీకి చేరుకున్నది. ప్రభుత్వ నిర్వహణ లోపంతో కాళేశ్వరం నుంచి నీళ్లు రాక ప్రాజెక్టు ఎండిపోవడంతో మత్స్యకారులు చేపలు పడుతున్నారు. ఈ క్రమంలో శుక్రవారం రాజబాబు అనే మత్స్యకారుడికి 20 కిలోల చేప ఒకటి, 15 కిలోలకుపైగా బరువున్న రెండు చేపలు పడ్డాయి. వీటి విలువ దాదాపు రూ.6,500 నుంచి రూ.7 వేల వరకు ఉంటుందని రాజబాబు సంబురపడ్డాడు.

– మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్

# వర్ధన్నపేటలో నకిలీ విత్తనాల కలకలం

- దుకాణం ఎదుట రైతుల ఆందోళన
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట, జూన్ 28 : వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో నకిలీ వరి విత్తనాల విక్రయం కలకలం సృష్టించింది. మండల కేంద్రానికి చెందిన ఓ ఎరువుల దుకాణంలో రాయపర్తి మండలం తిర్మలాయపల్లికి చెందిన రైతులు మహేశ్, నాగరాజు వారం రోజుల క్రితం వరి విత్తనాల బస్తాలను కొనుగోలు చేసి మండెకట్టారు. మూడు రోజులైనా మండె రాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురై విత్తనాలను అదే బస్తాలోకి ఎత్తుకొని శుక్రవారం సదరు దుకాణం వద్దకు వచ్చి నిలదీశారు. వ్యాపారి సరైన సమాధానం చెప్పకుండా దాటవేయడంతో రైతులు స్థానికులకు విషయం తెలిపి ఆందోళనకు దిగారు. తాము బస్తాకు రూ.950 చెల్లించి కొనుగోలు చేసిన విత్తనాలు మొలకెత్తకపోవడంతో నష్టపోయామని వారు ఆవేదన వ్యక్తంచేశారు.

### సమగ్ర విచారణ జరపాలి..

రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతున్న విషయమై ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు డిమాండ్ చేశారు. ఆయన రాయపర్తికి వెళ్తున్న క్రమంలో వర్ధన్నపేటలో రైతుల ఆందోళనను తెలుసుకొని వారితో మాట్లాడారు. వరంగల్ కలెక్టర్, వ్యవసాయ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయమై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ కొట్లాడుతుందని తెలిపారు.

నకిలీ విత్తనాల విషయమై కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

### కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

పాలకుర్తి రూరల్, జూన్ 28 : బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసి కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శుక్రవారం జనగామ జిల్లా పాలకుర్తిలోని విస్నూరు రోడ్‌లో బీఆర్ఎస్ నియోజకవర్గ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. కార్యకర్తల బలం, ప్రజల మద్దతుతో రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. కేసీఆర్‌ను మరోసారి సీఎం చేయడమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. ఎన్నో రాజకీయ పార్టీలను, ఎందరో సీఎంలను చూశామని, ఎవరికీ భయపడలేదని అన్నారు. కార్యకర్తలకు ఎలాంటి ఆపద వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నాగం శశిధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పన

# ప్రజల గుండెల్లో మర్రి పేరు చెరపలేరు

- బీఆర్ఎస్ శ్రేణుల జోలికొస్తే ఖబడ్దార్
- ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే మర్రి ఆగ్రహం
- ఆందోళనకరంగా శాంతిభద్రతలు: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు: ఎమ్మెల్సీ నవీన్

నాగర్‌కర్నూల్, జూన్ 28: 'నేను విద్యార్థుల జీవితాలతో రాజకీయాలు చేయడం లేదని, పాఠశాలల బోర్డులపై, గోడలపై నా పేరును తీసేయగలరేమోకానీ.. ప్రజల గుండెల్లో మాత్రం నా పేరును చెరపలేరు' అని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో గెలుపొందిన నవీన్‌కుమార్‌రెడ్డికి శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని వైభవ్ గార్డెన్స్‌లో ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నవీన్‌కుమార్‌రెడ్డితోపాటు మర్రి జనార్దన్‌రెడ్డిని సన్మానించారు. మర్రి మాట్లాడుతూ.. 'మా ట్రస్ట్, మర్రి ప్రైవేట్ లిమిటెడ్(సీఎస్ఆర్) కంపెనీ సౌజన్యంతో నిర్మించిన పాఠశాల భవనం'పై కాంగ్రెస్ నేతలు రాజకీయం చేయడాన్ని తప్పుపట్టారు. దమ్ముంటే తనలా స్కూల్స్ కట్టి చూపించాలి అని సవాల్ చేశారు. బీఆర్ఎస్ శ్రేణుల జోలి కొస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. తమ పార్టీ నేత శ్రీధర్‌రెడ్డి హత్యకు గురై నెలరోజులు దాటినా కేసులో ఎలాంటి పురోగతి లేదని, రాష్ట్రంలో శాంతిభద్రతలు ఆందోళనకరంగా ఉన్నాయని విమర్శించారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో తన గెలుపు కోసం అహర్నిశలు శ్రమించిన పార్టీ నాయకత్వానికి, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లకు ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో నాయకులు నాగం శశిధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పనాభాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# హైవేల నిర్మాణంలో వేగం పెంచాలి

- ఆర్మూర్-మంచిర్యాల రహదారికి భూమి సేకరించాలి
- అధికారులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని జాతీయ రహదారుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ట్రిపుల్‌ఆర్‌పై మరింత పకడ్బందీగా కసరత్తు చేయాలని సూచించారు. జూలై మొదటి వారంలో రాష్ట్రానికి ఎన్‌హెచ్ ఉన్నతాధికారుల బృందం రానున్న నేపథ్యంలో హైవేలపై పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. శుక్రవారం హైటెక్ సిటీలోని న్యాక్ ఆఫీసులో నేషనల్ హైవేలపై ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మన్నెగూడ రోడ్డు నిర్మాణంలో ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆర్మూర్–మంచిర్యాల హైవే కోసం భూమిని సేకరించాలని ఆదేశించారు. ఈ హైవేకు 630 హెక్టార్ల భూమి కావాల్సి ఉండగా530 హెక్టార్లు సేకరించామని, మిగతా పనులను ఈ నెలలో పూర్తి చేస్తామని మంత్రికి అధికారులు వివరించారు.

# అనుమతులు లేవని భవనం కూల్చివేత

- కక్షపూరితంగా కూల్చారని బాధితుల ఆవేదన

బొడ్రాయిబజార్, జూన్ 28 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని 16వ వార్డు బేచిరాగ్ మాదారంలో పడిదల శ్రవణ్‌కుమార్‌కు చెందిన జీ+1 భవనాన్ని శుక్రవారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. కక్ష పూరితంగా భవనాన్ని కూల్చివేశారని బాధితులు వాపోయారు. నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణం చేయడంతో ఈ ఏడాది మే 18, 23, 29న మూడు షోకాజ్ నోటీసులను ఇంటి యజమానికి పంపినట్టు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. అనుమతి లేనందునే జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సిఫారసు మేరకు భవనాన్ని కూల్చినట్టు చెప్పారు.

### కట్టు బట్టలు తప్ప ఏమీ మిగల్లేదు

స్లాబ్ వేస్తున్నప్పుడు అధికారులు ఆపేయాలని చెప్పడంతో ఆపేశాం. శుక్రవారం ఏకంగా ఇల్లు మొత్తం కూలగొట్టారు. కాళ్లు పట్టుకొని వేడుకున్నా కనికరించలేదు. రూ.20లక్షలతో ఇల్లు కట్టుకున్నాం. కట్టు బట్టలు తప్ప ఏమీ మిగల్లేదు. ఇది కక్షపూరితంగానే చేశారు.

–బాధితుడు పడిదల మాధవరావు

### మా భూమిని ఎమ్మెల్యే దొంతి ఆక్రమించాడు

- సీఎం రేవంత్‌రెడ్డి కాపాడాలని బాధితుల వేడుకోలు

హనుమకొండ చౌరస్తా, జూన్ 28 : వరంగల్ జిల్లా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తమ భూమిని ఆక్రమించాడని, అన్ని డాక్యుమెంట్స్ ఉన్నప్పటికీ తమను ఖాళీ చేయాలని ఆయన సోదరుడు తిరుపతిరెడ్డి బెదిరిస్తున్నాడని బాధితులు దేవర రమేశ్, ఆయన తల్లి సారమ్మ ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నుంచి ప్రాణహాని ఉందని, సీఎం రేవంత్‌రెడ్డి తమను కాపాడాలని బాధితులు 'నమస్తే తెలంగాణ'తో గోడు వెల్లబోసుకున్నారు. వివరాల్లోకెళ్తే.. ములుగురోడ్ దర్గా ఎదురుగా కాపువాడ పెద్దమోరి పక్కనే 769 సర్వే నంబర్‌లో ఇల్లు కట్టుకున్నామని, 757 సర్వే నంబర్‌లోని ప్లాట్‌ను ఎర్రబెల్లి విజయకుమార్‌రావు ఎమ్మెల్యే మాధవరెడ్డికి 2002లో అమ్మాడని తెలిపారు. దొంతి మాధవరెడ్డి ఈ భూమి విషయమై కేసు వేయగా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని తెలిపారు. అయినా మున్సిపల్ అధికారుల తో ఎమ్మెల్యే సోదరుడు వచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

# కుక్కలు తరిమిన దుప్పితో విందు!

**మాంసం తిన్న 12 మంది నుంచి రూ.15 వేల చొప్పున వసూలు**

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 28 (నమస్తే తెలంగాణ): కాగజ్‌నగర్‌లోని రస్పల్లి–సర్సాల అటవీ ప్రాంతం నుంచి కుక్కలు తరుముకుంటూ వచ్చిన దుప్పిని పట్టుకున్న గ్రామస్థులు.. దానిని చంపి మాంసాన్ని పోగులేసుకొని విందు చేసుకున్నారు. ఈ విషయమై విచారణ చేపట్టిన ఫారెస్టు అధికారులు 12 మంది నుంచి రూ.15 వేల చొప్పున డబ్బులు వసూలు చేసి వదిలేశారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్ మండలం దరోగపల్లిలో దాదాపు వారం క్రితం జరిగిన ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు దరోగపల